# మదర్స్ డే

తెల్లారకుండానే ఫోను మోగుతుంటే, కళ్ళు తెరవకుండానే దిండు పక్కనే వున్న సెల్ అందుకుంది శకుంతల. చెవి దగ్గర పెట్టుకుని ఎవరై వుంటారా అనుకుంటూ 'హలో' అంది. "శుకూ నీకో శుభవార్త చెప్దామని సుప్రభాతం పాడుతున్నా" అంది అవతలివైపు నుంచి వనజ.

"శుభవార్త – ఏమిటి? చెప్పు చెప్పు" అంటూ తొందర చేసింది.

'నువ్వు పది గంటలకల్లా మా స్టూడియో కొచ్చెయ్. నిన్ను యాంకర్‌గా సెలక్ట్ చేసే ప్రయత్నంలో రాత్రి పన్నెండు అయింది. అప్పుడే చేద్దామనుకున్నా. కానీ... ఎందుకులే అని ఇప్పుడు చేస్తున్నా' అంది ఒక గుక్కలో.

"నిజమా" బద్ధకం వదిలి గట్టిగానే అరిచింది శకుంతల.

"లేకపోతే ఈ రోజు ఏప్రిల్ ఫస్టు కూడా కాదు" నవ్వింది వనజ.

"నేను నమ్మలేకుండా వున్నాను" అంది.

మరిక నమ్మి లేచి త్వరగా తయారై వచ్చేయ్. మంచి కలర్‌ఫుల్ డ్రస్ వుంటే వేసుకురా – కాస్ట్యూమ్ ఇక్కడ కూడా వున్నాయిలే. చూద్దాం – మేకప్ సరేసరి – సరేనా – బై" అంటూ ఫోన్ పెట్టేసింది. శకుంతలకి ఒక్కసారి మెలకువ వచ్చినట్లుగా అనిపించింది. వనజ చెప్పిన విషయం పూర్తిగా అర్థమయ్యేసిరిక ఒకటే టెన్షన్?

ఎటూ తోచక ఒక్క క్షణం అలాగే వుండిపోయింది. ఆనందంగా వున్నా ఏదో అసంతృప్తి లోపల్లోపల వుంది. ఎన్నాళ్ళుగానో తను కలలుగంటున్న కోరిక ఇంత సడెన్‌గా ఎదురైంది. ఇప్పుడు తనీ అవకాశం బాగా ఉపయోగించుకుని, తనని తను నిరూపించు కోవాలి.

మంచం మీంచి ఒక్కసారిగా కిందకి దూకింది. పక్క మంచం మీద ఇంకా నిద్రపోతున్న లావణ్య ముఖం మీంచి దుప్పటి తొలగించి చూసి, అబ్బా! నీకప్పుడే తెల్లారిందా తల్లీ అని మళ్ళీ కప్పేసుకుంది.

ఎనిమిదిన్నరకే జోళ్ళలో కాళ్ళు పెట్టి 'మరి నే వెళ్తున్నా' అంది.

"ఆల్ ది బెస్ట్ - బై" అంది లావణ్య చెయ్యూపుతూ...

రెండు బస్సులు మారి ఆ టీవి ఆఫీసుకి చేరేసరికి ఇంకా పావు తక్కువ పదే అయింది.

హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకుని, లోపలికి అడుగు పెట్టింది. ఎప్పుడో ఒకసారి వనజతో వచ్చిందక్కడికి.

అక్కడే వున్న కుర్రాడు వచ్చి శకుంతలగారా - వనజగారొస్తారు కూర్చోండి అంటూ లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. ఆ రూం మధ్యలో పెద్ద ఆఫీసు టేబుల్. దాని చుట్టూ పది ఛైర్లు నీట్‌గా. నిగనిగలాడుతూ వున్నాయి. దానిమీద అప్పటికే అమర్చిన మంచినీళ్ళ గ్లాసులు.

శకుంతల ఒక గ్లాసు నీళ్ళందుకుని కుర్చీలో కూర్చుని తాగేసింది. ప్రాణం హాయిగా అనిపించింది. ఆందోళన తగ్గి కుదుటపడినట్లుగా ఉంది. తనేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో ఏమీ తెలీదు. వనజ వస్తే గానీ అంతా సస్పెన్స్ - అయినా ఏదైనా అప్పటికప్పుడు అందంగా, బాగా చెయ్యాలి. అదీ ఛాలెంజ్.

తుఫాన్‌లా దూసుకొచ్చిన వనజ "హాయ్ శకూ - యూ ఆర్ వెరీ లక్కీ" అంటూ భుజాలు పట్టుకొని ఊపేసింది.,

"నిజమే - థాంక్యూ వెరీమచ్" అంది నెమ్మదిగా.

"ఇట్స్ ఓకే - నువ్వు ఫస్టు యాంకరింగ్ చేస్తున్న ప్రోగ్రాం ఎంత గొప్పదో తెలుసా?" అంది.

శకుంతల తెల్లమొహం వేసి "నాకేం తెలుసు" అంది.

రేపు మదర్స్ డే - ఆ సందర్భంగా ఒక ప్రోగ్రాం. ఇద్దరు పేరున్న రచయితలు, ఒక డాక్టరు, ఒక సైకియాట్రిస్టు, మధ్యలో ఒక తల్లీ కూతురు చేసే వంట. మొత్తం ప్రోగ్రాం నువ్వే.

మదర్స్ డే అనగానే శకుంతల ముఖం చిరాకుగా చిటపటలాడింది. కానీ, ఆమె ముఖంలో భావాలు వనజ చూసినట్లు లేదు. అందుకే వెంటనే డ్రాయరు సొరుగులోంచి నాలుగు పేజీల స్క్రిప్టు తీసి -

అమ్మంత గొప్పది ఈ ప్రపంచంలో లేదు. అమ్మ మాటలలోని అమృతం మరెక్కడా దొరకదు. అమ్మతనంలోని కమ్మదనం అరుదైన వరం. అమ్మ తినిపించే గోరుముద్దలు ఆప్యాయతను అందించే వెన్నముద్దలు.

ఇలా చదువుకెళ్ళిపోతుంటే శకుంతల వంటికి కారం రాసినట్లుగా అనిపిస్తోంది. కానీ ఈ స్క్రిప్టు రకరకాల హావభావాలతో ముద్దుగా, ముచ్చటగా మురిపెంగా, గారంగా, గాఢంగా చదివి ప్రేక్షకుల్ని అలరించాలనే ఊహ ఆమెని కృంగదీసింది.

సంప్రదాయ సిద్ధంగా ఉన్న డ్రస్ వేసి అత్యంత ఆధునికంగా మేకప్ చేసి, మోచేతుల వరకూ గాజులు- మెడలో బరువైన పతకం చేతులు రెండూ కలుపుతూ విడదీస్తూ, విచిత్రంగా మెడని ఊపుతూ, తలకాయ పంకించి, కళ్ళు గుండ్రంగా తిప్పుతూ, ఒళ్ళంతా పులకింతగా జలదరింపజేస్తూ శకుంతల అరనిముషంలో కంఠతా పట్టిన వాక్యాలను అలవోకగా చెప్పింది.

ప్రోగ్రామర్ రెండు మూడుసార్లు ఆమె దగ్గరకొచ్చి, భాష బాగుంది. ఎక్స్‌ప్రెషన్ కూడా బాగానే ఉంది, కానీ ఫీలింగ్ ఇంకా గాఢంగా ఉండాలి అని చెప్పాడు. ఆమె చేతనైనంత నటన చేసింది.

రెండు గంటలు రికార్డింగ్ తర్వాత ఓకే అయ్యింది. డాక్టర్లు, రచయిత్రులు, వంటలక్కలు అందరూ ఆనందంగా అమ్మతనాన్ని అందరికీ పంచి తరించారు.

చివరగా అంతా బాగానే ఉంది కానీ "ఫీలింగ్ పలికించడంలో ఇంకా శ్రద్ధ వహించాలి" అన్నాడాయన.

'ఫస్ట్ టైం' కదా అంది వనజ.

"ఎస్. ఎస్.." అంటూ తల ఊపి వెళ్ళిపోయాడు.

వనజ షేక్ హ్యాండ్ ఇచ్చి "ఎల్లుండి కలుద్దాం. రేపు మా అమ్మ దగ్గరకు వెళ్ళాలి. నువ్వు ప్రోగ్రాం మిస్సవకు. నాకుచెప్పాలి. బై..." అంది.

శకుంతల బయటకొచ్చింది. కడుపులో మంటగా ఉంది. గుండెల్లో గుబులుగా, మనసంతా కలతగా ఉంది. దుఃఖంగా ఉంది. నెల్లాళ్ళ క్రితం తన ఆలోచనా, తన ఊహలు, ఆశలు వేరుగా ఉండేవి. ఒక్కసారిగా రంగు రంగుల పూలవనం ఉప్పెనలో ఊడ్చిపెట్టుకు పోయినట్లుగా అయిపోయింది.

● ● ●

ఆ రోజు శకుంతల ఇంట్లోంచి బయటికి అడుగు పెడుతుంటే 'తులసీ' అంటూ మహాలక్ష్మి ఆంటీ లోపలికొచ్చింది. వస్తూనే శకుంతల వైపు పరీక్షగా చూసి, పరవశంగా కళ్ళు చిన్నవి చేసి...

"నీ ముందు ఏ సినిమా స్టారైనా దిగదుడుపే" అంటూ చూపుడు వేలు, బొటన వేలు సూపర్ అనే భంగిమ చూపించింది.

'రావే లక్ష్మి' అంది తులసి.

బయటకెళ్ళిన శకుంతల హాల్లోనే షోకేస్‌లో పెట్టిన అడ్రస్ కాగితం తీసుకునేందుకు మళ్ళీ వచ్చింది. అప్పుడే ఆమె చెవుల్లో విచిత్రమైన మాటలు పడ్డాయి.

"రోడ్డు మీద దొరికింది కానీ, అందాల చందమామ లాంటి పిల్ల దొరికిందే నీకు, తులసీ" అంది మహాలక్ష్మి.

ఆ మాటలు అత్యంత స్వచ్ఛంగా, స్పష్టంగా వినిపించడంలో అచేతనంగా అక్కడలా నిలబడిపోయింది శకుంతల. "అబ్బో, కాస్త చనువున్న వారంతా అంటారు. ఆ పిల్ల అస్సలు మీ అమ్మాయిలాగే ఉండదు. మీ పోలిక ఎక్కడా లేదు" అంటూ మురిపెంగా చెప్పింది తులసి.

శకుంతల గుండెల్లో పెద్దరాయి పడినట్టు బరువుగా అనిపించింది.

"నీ మొహం. నిజానికి హేమమాలిని క్కూడా ఇంత అందమైన కూతురులేదు. ఏ తల్లి కన్నబిడ్డో తెలీదుగానీ - ఏ మహారాణియో కని పడేసిందనిపిస్తుంది" అంది మహాలక్ష్మి.

శకుంతలకి పూర్తిగా విషయం అర్థమైంది. సుమారు ఐదారేళ్ళ క్రితం వివేకం మామయ్య వచ్చినప్పుడు మాటల్లో ఏదో అందీ అందని అనుమానం వచ్చింది. కానీ వెంటనే అది పక్కకెళ్ళిపోయింది.

షోకేస్‌లో బొమ్మ కింద పెట్టిన కాగితం తీసుకుంది. కానీ కన్నీళ్ళు ఆగడం లేదు. అసలు తనెవరు? నాకు అమ్మ తులసి కాకపోతే తనని కన్న అసలు అమ్మ ఎవరు? అదేగా వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. తనని కన్న తల్లి రోడ్డు మీద వదిలేసి వెళ్ళిపోతే ఈమె తెచ్చి పెంచి తననింతదాన్ని చేసిందన్న మాట.

ఆ క్షణంలో ఈ పెంచిన తల్లిమీద ప్రేమ పొంగి పొర్లిపోవడానికి బదులు వదిలేసిన కన్నతల్లి మీద కసి, కోసం ఉప్పెనలాగా పెరిగాయి. హాల్లో చప్పుడైతే వచ్చిన తులసి, అక్కడ శకుంతలని చూసి కంగారు పడిపోయింది. దానికి తోడు కళ్ళ నిండా నీళ్ళతోవివర్ణమైన కూతురి ముఖం చూస్తే ఆమె మనసు తల్లడిల్లపోయింది. నోట మాట రాలేదు. శకుంతల అక్కడే సోఫాలో కూలబడి వెక్కివెక్కి ఏడవటం మొదలు పెట్టింది. బయటకొచ్చిన మహాలక్ష్మి సంగతి గ్రహించింది. తన వల్ల తప్పు జరిగిందని తెలిసి, దాన్ని సరిదిద్దుకోవాలని తాపత్రయం మొదలు పెట్టింది.

"శకూ! అమ్మలూ, ఏమిటే" అంటూ బుజ్జగించబోతే బోరుమంది ఆమె.

ఇద్దరూ ఏం చెయ్యాలో తోచక తికమక పడ్డారు...

చక్కగా, అందంగా తయారై బయటకెళ్ళబోతున్న శకుంతల పది నిముషాల్లో పాలిపోయిన ముఖంతో, చెదిరిన జుట్టుతో కాటుక మరకల చెంపలతో వికారంగా తయారైపోయింది. మహాలక్ష్మి, తులసి అయోమయంలో అక్కడే ఉండిపోయారు. ఇద్దరూ శకుంతలని బుజ్జగించి, లాలించి నెమ్మదిగా అసలు సంగతి చెప్పక తప్పలేదు.

"ఏదో ఒక రోజున నీకు ఈ విషయం చెప్దామనే అనుకున్నాను. ఏదో అలా గడిచిపోతూ వచ్చింది. ఇలా హఠాత్తుగా నువ్వు వినడం, విలవిల్లాడిపోవడం నాకెంతో

బాధగా ఉంది. అయినా ఇందులో నే చేసిన తప్పేమీ లేదు. నాకు పిల్లలు లేరు. అప్పుడు మేం బళ్ళారిలో ఉండే వాళ్ళం. తెలతెలవారుతుండగా, వాకిలి తుడిచి ముగ్గువేద్దామని తలుపుతీసిన నాకు పొత్తిళ్ళలో నువ్వు కనిపించావు. ఆశ్చర్యంతో చూసి ఎత్తుకుని చుట్టూ చూశాను, ఎవ్వరూ కనిపించలేదు. మీ నాన్నని, అదే మా ఆయన్ని లేపి చెప్పాను. చుట్టు పక్కల వాళ్ళు లేచి హడావుడి చేశారు. పోలీసు స్టేషన్లో అప్పగించమన్నారు. మేమిద్దరం మాట్లాడుకుని మా దగ్గరే ఉంచేసుకున్నాం. ఆ రోజే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి చూపించి మందులూ అవీ తీసుకున్నాం. అప్పటికి నీకు పది, పన్నెండు రోజులు వయస్సుండవచ్చు".

"మీ నాన్న నిన్ను ప్రాణం కంటే ఎక్కువగా చూశారు. మేం ఇద్దరమే ఉన్నప్పుడు నీ గురించే చెప్పేవారు. పోయేటప్పుడు కూడా నీ మాట చెప్పే ప్రాణం వదిలారు" తులసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఒక వారం రోజులు శకుంతల మామూలు మనిషి కాలేకపోయింది. మరో లోకంలోకి అడుగుపెట్టినట్టు, మరో జన్మ ఎత్తినట్టు ఆమెకి తరచూ అనిపించేది. అనుక్షణం తను అనాథ, పుట్టిన వెంటనే తల్లి తనను వదిలేసింది అనే ఆలోచన వదలకుండా బాధించడం మొదలుపెట్టింది. తల్లికంటే ప్రేమగా పెంచిన తులసితో తన బాధని పంచుకోలేక మధనపడిపోయింది.

● ● ●

"ఈ మాతృత్వం, తల్లిప్రేమ, అమ్మతనం అనే భావజాలం వట్టి బూటకం అని నా నమ్మకం. బిడ్డని కన్న తల్లి ఆ బిడ్డకోసం ప్రాణాలు వదిలేస్తుందనీ, తన సుఖం, తన మానం, తన కోరిక, తన ఆశలు అన్నీ బిడ్డకోసం వదిలేసుకుంటుందని చెప్పడానికీ, వినడానికీ, బాగానే ఉన్నా, అది నిజం కాదనిపిస్తుంది. బిడ్డని కని, ఒక్కక్షణం కూడా వదలకుండా అంటి పెట్టుకుని ఆ పసిబిడ్డని సాకడం వల్ల ఒక అనుబంధం - ఒక అటాచ్‌మెంట్ ఉండి పిల్లలకోసం తల్లి పాటుబడుతుంది. అది కూడా తన పరిధిలోనే... తన పురువు, తన సుఖం, తన వ్యక్తిత్వం, తన ఆశలు ఇవన్నీ పోగొట్టుకొని కాదు. అవి ఉన్నప్పుడే, అదే నిజం కాకపోతే ఇంతమంది పిల్లల్ని కని అక్కడా, ఇక్కడా ఎందుకొది లేస్తున్నారు. పరిస్థితుల ప్రభావం అంటారు. అదే పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే అన్ని ప్రేమలూ, తనాలూ ఉంటాయి. పుట్టిన క్షణం నించి ఒక తండ్రి ఆ బిడ్డని అంటిపెట్టుకుని ఉచ్చలు తీసి, దొడ్డి గుడ్డని మార్చి, ముడ్డి కడిగి, పాలుపట్టి, ఏడిస్తే ఊరడించి, జోకొట్టి, భయపడితే గుండెలమీద జేర్చుకుని ధైర్యం కలిగించి, అన్నీ చేస్తే ఆ తండ్రికి బిడ్డమీద అమ్మతనం, మాతృత్వం, మరేదో... మరేదో అన్నీ కలుగుతాయి. కనడం అనేది ఒక మెకానికల్ ప్రక్రియ. దాన్ని ఆకాశానికి ఎత్తవలసిన అవసరం లేదు. నిర్లక్ష్యం చేయనవసరం లేదు. ఒక స్త్రీ కడుపులోంచి బయటకొచ్చినంత మాత్రాన ఆ

తల్లికి ఆ పిల్లమీద ఎనలేని ప్రేమ ఉండాలని రూలేం లేదు. ప్రేమ ఒక అలవాటు. ఒక అనుబంధం. ఒక అటాచ్‌మెంట్. అంతే" అమె మాటలు నోరు తెరిచి వింటూ ఉండిపోయింది శకుంతల.

"మీరు చెప్పేది నాకు నమ్మశక్యం కావడం లేదు. ఇన్నాళ్ళు వింటూ, నమ్ముతూ వచ్చింది ఒక్కసారి అబద్ధం అంటే..." ఆగింది.

"ఒక్కసారిగా నమ్మకు, నెమ్మదిగా ఆలోచించి అర్థం చేసుకోడానికి ప్రయత్నించు".

"నాకంతా అయోమయంగా ఉంది". శకుంతల అస్థిమితంగా తలూపింది.

"కేవలం కన్నందుకే ప్రేమ ఉంటుందంటే ఎప్పుడో పద్దెనిమిదేళ్ళక్రితం నిన్ను కవి వదిలేసిన నీ తల్లికీ, నిన్ను పెంచిన తులసి కంటే నీ మీద ఎక్కువ ప్రేమ ఉండాలి కదా..."

"అబ్బే! మా అమ్మకి, అంటే నన్నుపెంచిన తల్లికి నేనంటే పంచ ప్రాణాలు, ఈ ఇరవై రోజులుగా ఆమె చిక్కి సగమైపోయింది.

"అందుకే నువ్వు పిచ్చి ఆలోచనలు మాను. ఈ జీవితంలో మనికి లభించేదే ప్రేమ. ఎక్కడో ఏదో పోగొట్టుకున్నామని అశాంతి పాలవడం అజ్ఞానం" అంటూ ఆమె శకుంతల వైపు చూసి స్నేహంగా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు స్ఫురించాయి.

'స్త్రీ హృదయం' సంస్థకోసం పని చేస్తున్న గార్గి మాటలు శకుంతల మీద ఎంతగానో పనిచేశాయి. ఇరవై రోజులుగా తను అమ్మమీద అలిగి లావణ్య రూంలో వుండిపోయింది. ఎన్నిసార్లు అమ్మ బతిమాలినా వెళ్ళలేదు. కారణం తెలీదు. అసలు సంగతి తెలిసి లావణ్య తనని ఇక్కడికి తీసుకొచ్చింది. మబ్బు విడిపోయినట్లుగా వుంది. వెంటనే గుండెల్లోని బాధను ఎవరో తొలగించినట్లనిపించింది.

"ఆడవాళ్ళు మాత్రమే పిల్లల్ని పెంచడం, అంటే ఇరవై నాలుగు గంటలూ అదే పనిలో వుండాలి. విసుగూ, విరామం వుండకూడదు. చనుబాలు తల్లి దగ్గరే కదా తాగేది. అందుకని మొత్తం పని స్త్రీలకే అప్పగించారు. ఉత్తినే ఇస్తే వాళ్ళు ఎదురుతిరిగే అవకాశం వుంది. నువ్వా బిడ్డ పని చెయ్యి" అనొచ్చు. అందువల్ల స్త్రీత్వం, మాతృత్వం, అమ్మతనం, మాతృప్రేమ లాంటి మాటలతో వాళ్ళని గారడీ చేసి పని చేయిస్తూ వస్తారన్నమాట. లేకపోతే ఉచ్చగుడ్డలు ఉతకడం, స్నానాలు చేయించడం, రోగాలు రొస్టులూ వస్తే చూసుకోవడం పురుషుల మీద కూడా పడతాయి. అందువల్ల పిల్లల్ని పెంచే బాధ్యత తల్లులదేనని, ఆ పని వారే చెయ్యగలరని నిర్ణయించి వదిలేశారు. పిల్లలని కని ఒక వేళ భార్య చనిపోతే, మరొక భార్యని వెంటనే కట్టుకుని 'పిల్లాడ్ని పెంచాలి కదా' అని న్యాయం పలుకుతారు.

బాగా ఆలోచిస్తే ఆడపనీ, మగపనీ అంటూ ఏమీ లేవు. ప్రయత్నిస్తే అన్ని పనులూ అందరూ చెయ్యగలరు. ఏం? ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అన్నారు. ఈప్పుడది

మారిపోలేదూ....

ఇంతకీ అసలు సంగతికొస్తే మనిషి ఆడైనా, మగైనా తనీ ప్రపంచంలో బ్రతకడానికి అడ్డు తొలగించుకుంటూ పోవడం సహజం. ఇక్కడ అమ్మకో న్యాయం, నాన్నకో న్యాయం లేదు.

"జరిగిపోయిన పాత కథని గురించి ఆలోచించి మనసు పాడు చేసుకోకు. ఎవరు ఏ పని చేసినా వెనుక బలమైన కారణాల్ని అర్థం చేసుకుంటూ పోవడమే మనం చెయ్యాల్సిన పని" పెద్ద లెక్చరిచ్చి ఊపిరి పీల్చుకుంది గార్గి.

పిల్లలకి కూడా తల్లిదండ్రులతో కలిసి పెరిగితేనే వాళ్ళమీద ప్రేమ, అనుబంధం ఉంటాయి. దూరంగా పెరిగిన పిల్లలకి తల్లిదండ్రుల మీద అనురాగం ఉండదని ఇప్పుడు అందరూ గోల పెడుతున్నారు. పిల్లలు పేరెంట్స్ నుండి దూరంగా ఉండడం వెస్టరన్ కల్చర్‌గా బాధపడి పోతున్నారు. ఎక్కడో ఉన్న తల్లిని ఏడాదికోసారైనా చూసి రావాలనే నిర్ణయం. అది ప్రేమ, అనుబంధాలకి సంబంధించిన విషయం కాదు. ఇంకా మన దేశ సంస్కృతిలోకి పూర్తిగా వ్యాపించలేదు. ఈ అలవాటుని మనం ఎంతో ఉత్సాహంగా చేసుకుంటున్నాం. ఆమె ఆగింది.

శకుంతల ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎదురుగా ఆమె ఏవో పేపర్లు చూసుకుంటున్నారు. ఆమె చెప్పాల్సింది చెప్పేసినట్టుగా.

"నేను వెళ్ళొస్తానండి. మీ దగ్గరికి రావడం, మీ మాటలు వినడం నాకెంతో బావుంది. ఇంకా ఎలా చెప్పాలో..."

"ఏం చెప్పద్దు. హాయిగా హ్యాపీగా ఉండు. పెద్ద వయస్సులో మీ అమ్మని బాధించకు. అప్పుడప్పుడు వస్తుండు" అంది గార్గి.

మళ్ళీ తలెత్తి "అవునూ – రేపు టీవీలో నీ ప్రోగ్రాం ఉందిటగా చూస్తాలే" అన్నదామె చిరునవ్వుతో...

"అయ్యో! మీరు చూస్తారా... అదంతా" ఆగింది శకుంతల. "నువ్వేం చెప్పావో కాదు. ఎలా చెప్పావో చూస్తా" ఆమె నవ్వింది.

శకుంతల మనసు ఆరాట పడిపోతోంది. ఎంత త్వరగా వెళ్ళి అమ్మని చూద్దామా అని కంగారు పడిపోతుంది.

'రేపు లేస్తూనే ఒక పూలబొకే అమ్మకోసం కొని ఇవ్వాలి–, అమ్మని ఇంకెప్పుడూ బాధ పెట్టకూడదు' అనుకుంది.

(17-07-2007 నవ్య వీక్లీ)